క్లుప్తంగా

ఆపద్బాంధవుడు సీఎం కేసీఆర్



అచ్చంపేట రూరల్: రాష్ట్రంలో ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరినీ సీఎం కేసీఆర్ ఆదుకుంటున్నారని, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో అధికంగా సీఎం సహాయ నిధులను మంజూరు చేశారని ఎంపీ రాములు అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఎంపీ కార్యాలయంలో సిద్దాపూర్ చెందిన బాధితుడు తిర్పతయ్య కుటుంబ సభ్యులకు రూ. లక్ష సీఎం సహాయ నిధి చెక్కును అందజేశారు.

పెద్దకొత్తపల్లి: వెన్నచర్లకు చెందిన మేదరి అక్షయ్ రూ.60 వేలు, మండలి బక్కయ్యకు రూ.50 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను సింగిల్ విండో డైరెక్టర్ కృష్ణ శర్మ శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పవన్ కుమార్‌శర్మ, రాంప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు బస్‌పాసులు అందజేత



కల్వకుర్తి టౌన్: గ్రామీణ ప్రాంతాల నుంచి పాఠశాల విద్య కొరకు వచ్చే విద్యార్థులకు ఉచిత బస్‌పాసులను ఆర్టీసీ అధికారులు శుక్రవారం బస్టాండ్‌లోని కౌంటర్ వద్ద అందించారు. 18 ఏళ్ల లోపు ఉన్న విద్యార్థినులకు ఆర్టీసీ ఉచిత బస్‌పాస్‌లను అందజేస్తుందని ఆర్టీసీ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్వేత తెలిపారు. ఆయా పాఠశాలలు, కళాశాలలో చదువుతున్న విద్యార్థినులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకొని, పత్రాలను కౌంటర్‌లో అందజేస్తే ఉచిత పాస్‌లను తీసుకోవచ్చని చెప్పారు. స్టేషన్ మేనేజర్ శ్రీనివాసులు, మల్లయ్య పాల్గొన్నారు.

సీఐటీయూ నాయకుల ఇంటింటి సర్వే



తెలకపల్లి: సీఐటీయూ, ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలో గడ్డంపల్లిలో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఇళ్ల స్థలాల సమస్యలపై సర్వే నిర్వహించి గ్రామంలో ప్రజల వివరాలు సేకరించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ ఇళ్ల స్థలాలు నిరుపేదలందరికీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లాలో వందల ఎకరాల భూమి ప్రభుత్వ ఆధీనంలో ఉందని ఆ భూమిలో పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలన్నారు.

‘ఉపాధి’ పనుల పరిశీలన

పెద్దకొత్తపల్లి: మండలంలోని గంట్రావుపల్లిలో సంపద వనాల పనులను ఎంపీడీఓ కృష్ణయ్య శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాలలో కూలీలందరికీ పని కల్పించాలని సూచించారు. కొత్తగా అవసరం ఉన్న కూలీలకు జాబ్‌కార్డులను అందజేయాలని ఉపాధి సిబ్బందికి సూచించారు.

నేడు దేశవ్యాప్తంగా వనభోజనాలు

వెల్దండ: ప్రధాని పిలుపు మేరకు శనివారం దేశవ్యాప్తంగా నిర్వహించే వజనభోనాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని గుండాల అంబారామలింగేశ్వర్ స్వామి దేవాలయ ఆవరణ పరిశీలించారు. దేశంలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో సహల్ వనభోజనాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తలు ఇంటి నుంచి భోజనాలను తీసుకువచ్చి సహపంక్తి భోజనాలను చేయాలన్నారు. శనివారం ఉదయం 10 గంటలకు గుండాల దేవాలయ ఆవరణంలోకి రావాలన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుడు కాంగ్రెస్‌లో చేరిక

అచ్చంపేట రూరల్: పట్టణానికి చెందిన బీఆర్‌ఎస్ ముఖ్య నాయకుడు గంగాపురం రాజేందర్ శుక్రవారం హైదరాబాద్ గాంధీ భవన్‌లో డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ ఆధ్వర్యంలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ.. 2001 నుంచి బీఆర్‌ఎస్‌లో క్రియాశీలకంగా పని చేశానని, ఉద్యమ కారుడిగా ఉన్నా పార్టీలో సముచిత స్థానం, గౌరవం లేక పార్టీని వీడినట్లు తెలిపారు. తెలంగాణను ఇచ్చిన సోనియాగాంధీ రుణం తీర్చుకోవడానికి కాంగ్రెస్‌లో చేరినట్లు తెలిపారు.



ప్రణాళికాబద్ధంగా పట్టణాల అభివృద్ధి

కొల్లాపూర్: ప్రణాళికాబద్ధంగా పట్టణాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పట్టణప్రగతి దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ మార్గదర్శకత్వంలో తెలంగాణలోని అన్ని పట్టణాలు అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నాయని వివరించారు. పరిశుభ్రతకు, పారిశుద్ధ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని తెలిపారు. నియోజకవర్గంలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారం కోసం నిధులు మంజూరు చేయాలని మంత్రి కేటీఆర్‌ను కోరిన వెంటనే రూ.8 కోట్ల నిధులు మంజూరుకు హామీ ఇచ్చారన్నారు. పట్టణంలోని మహిళా సంఘాల సభ్యులకు మంజూరైన రూ.2 కోట్ల రుణాలను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ హనుమనాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, కమిషనర్ రాజయ్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబాల పరామర్శ

పట్టణానికి చెందిన పలువురిని ఎమ్మెల్యే హర్షవర్ధన్ రెడ్డి శుక్రవారం పరామర్శించారు. 19వవార్డులో అనారోగ్యంతో మరణించిన కుక్క సింగన్న కుటుంబాన్ని, రజకవీధిలో అనారోగ్యంతో మృతి చెందిన శేషన్న కుటుంబాన్ని పరామర్శించారు. అంబేడ్కర్‌కాలనీలో ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందిన బండి రాములమ్మ కుటుంబాన్ని పరామర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.



మహిళా సంఘాల సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి

పల్లె ప్రగతి ద్వారానే బంగారు తెలంగాణ

కొల్లాపూర్ రూరల్: పల్లె ప్రగతి ద్వారానే బంగారు తెలంగాణ సాధ్యమైందని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఎర్రగట్లు బొల్లరం గ్రామంలో 80 మంది లబ్ధిదారులకు ఇళ్ల పొజిషన్ ధ్రువపత్రాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. బొల్లరం ప్రజల చిరకాల కల ముఖ్యమంత్రి కేసీఆర్ ద్వారా నెరవేరిందన్నారు. ప్రభుత్వంపై ప్రజలకు కూడా నమ్మకం, విశ్వాసం ఎప్పుడూ ఇలాగే ఉండాలన్నారు. అంతకుముందు ముక్కిడిగుండం, గేమ్యానాయక్ తండాలో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కొన్ని సమస్యలు అక్కడనే పరిష్కరించారు.

‘పట్టణప్రగతి’తో అద్భుత ఫలితాలు

అచ్చంపేట రూరల్: సీఎం కేసీఆర్ సారథ్యంలో పట్టణాలు, పల్లెలు అభివృద్ధి దిశలో పయనిస్తున్నాయని ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మున్సిపల్ చైర్మన్ ఎడ్ల నర్సింహాగౌడ్ ఆధ్వర్యంలో పట్టణ ప్రగతి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఎగురవేసి పట్టణంలోని ప్రధాన రహదారిగుండా మున్సిపల్ కార్మికులు, సిబ్బంది భారీ ర్యాలీ చేపట్టారు. అంబేడ్కర్ చౌరస్తాలో మానవహారం నిర్వహించారు. పట్టణంలోని ఫంక్షన్‌హాలులో నిర్వహించిన సమావేశంలో ప్రభుత్వ విప్ మాట్లాడారు. దూరదృష్టితో సీఎం కేసీఆర్, పట్టణ, పల్లె ప్రగతి కార్యక్రమాలు చేపట్టారన్నారు. పట్టణాల అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించి అభివృద్ధి చేయడంతో దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. మున్సిపల్ కార్మికులు అందిస్తున్న సేవల వల్ల పట్టణాలు స్వచ్ఛ పట్టణాలుగా ఉంటున్నాయన్నారు. దీంతో ఎన్నో అవార్డులు గెలుచుకున్నట్లు తెలిపారు. స్వచ్ఛత అవార్డులు రావడంలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర కీలకమన్నారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులను ఘనంగా సన్మానించి, కొత్త దుస్తులు అందించారు. కార్మికులకు ప్రభుత్వ విప్ స్వయంగా భోజనం వడ్డించారు.



ర్యాలీలో పాల్గొన్న ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు

సంఘాల భవనాలకు శంకుస్థాపన

పట్టణంలోని పలు సంఘాల భవనాల నిర్మాణాలకు ప్రభుత్వ విప్ భూమిపూజ నిర్వహించారు. ముదిరాజ్, నాయీబ్రాహ్మణ సంఘాలతో పాటు పలు సంఘాల భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ శైలజారెడ్డి, ఆర్డీఓ పాండునాయక్, తహసీల్దార్ కృష్ణయ్య, కమిషనర్ బలరాంనాయక్, రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు మనోహర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అరుణ, కౌన్సిలర్లు మనోహర్‌ప్రసాద్, తగురం శ్రీనివాసులు, శివ పాల్గొన్నారు.

అధికారులపై సభ్యుల ఆగ్రహం



మాట్లాడుతున్న ఎంపీపీ మనోహర

కల్వకుర్తిరూరల్: ప్రజాప్రతినిధులు, అధికారుల సమష్టిగా కృషితోనే మండలాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసుకోవచ్చని ఎంపీపీ మనోహర పిలుపునిచ్చారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సభలో ఎజెండాలోని అంశాల వారీగా అధికారులు నివేదిక చదివారు. పలు శాఖల అధికారులు అసంపూర్తి నివేదికతో రావడాన్ని ఎంపీపీ తప్పుపట్టారు. మండల సభ కొనసాగుతుండగా వివిధ అంశాలపై చర్చిస్తున్న సందర్భంలో కొంత మంది కార్యదర్శులు ముచ్చట్లు పెడుతూ, సెల్‌ఫోన్‌లో నిమగ్నమై ఉండడాన్ని గమనించిన ఎంపీపీ వారిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సభలో చర్చ జరుగుతున్న సమయంలో ఇలా చేయడం ఏంటని ప్రశ్నించారు. ఇందిరా క్రాంతి పథం, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ కార్యక్రమాలపై ఎంపీటీసీ శంకర్‌నాయక్, నర్సిరెడ్డి, సర్పంచ్‌లు అడ్డు తగులుతూ అధికారులను నిలదీశారు. ఎంపీటీసీ నర్సిరెడ్డి మాట్లాడుతూ మండలంలోని పంజుగుల నుంచి మొకురాలకు రోడ్డు పనులు చేపట్టడంపై హర్షం వ్యక్తం చేస్తూనే పనులు నాసిరకంగా చేస్తున్నారని, మిగతా రూ.80 లక్షలు మంజూరు చేసి రోడ్డును పూర్తి చేయాలని కోరారు. వైస్ ఎంపీపీ గోవర్దన్ మాట్లాడుతూ అధికారులు సమగ్ర సమాచారంతో రావడంతో పాటు ఎజెండాలోని అంశాలపై స్పష్టంగా వ్యవహరించాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ ఆంజనేయులు, తహసీల్దార్ రాంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌గౌడ్, ఎంపీఓ దేవేందర్ పాల్గొన్నారు.

మీజిల్స్‌ను పారద్రోలుదాం



నాగర్‌కర్నూల్ క్రైం: మీజిల్స్‌ను పారద్రోలేందుకు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది కృషి చేయాలని కలెక్టర్ ఉదయ్‌కుమార్ అన్నారు. డబ్ల్యూహెచ్‌ఓ ఎస్‌ఎంఓ అజహర్, కలెక్టర్ మీజిల్స్ టీకాకు సంబంధించి వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ చిన్నారులకు ఎంఆర్–2 టీకా డోస్‌ను వేయించాలని, వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ సుధాకర్‌లాల్ ఉన్నారు.

మల్టీపర్పస్ కార్మికులకు సన్మానం

బిజినేపల్లి: తిమ్మాజిపేట మండలం నుంచి మల్టీపర్పస్ వర్కర్స్‌గా ఎంపికైన సైదమ్మ, బుచ్చన్నలను తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతీలో పంచాయతీ రాజ్ డిప్యూటీ కమిషనర్ రవీంద్రరావు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కోడుపర్తి, అప్పాజిపల్లి, భవాజిపల్లి, తిమ్మాజిపేట, బుద్ధసముద్రం, వేముల నాయక్‌తండా పంచాయతీల నుంచి వర్మీ కంపోస్టు ఎరువును హైదరాబాద్ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించారు. తిమ్మాజిపేట మండలం నుంచి ఇద్దరు మల్టీపర్పస్ వర్కర్స్‌గా ఎంపిక కావడంతో పాటు ఎగ్జిబిషన్లో స్టాల్స్‌లో స్థానం సంపాదించడంపై జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేక అభినందనలు తెలిపారు.



బుచ్చన్నను సన్మానిస్తున్న రాష్ట్ర డిప్యూటీ కమిషనర్, ఇతర అధికారులు

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య



తాడూరు: ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందుతుందని ఎంఈఓ భాస్కర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు, పాఠశాలల నిర్వహణ వివిధ అంశాలను పరిశీలించారు. ఆయన పాఠశాల నిర్వహణపై తరగతి గదిలో విద్యార్థులకు బోధన ఏ విధంగా చేయాలి, పారిశుద్ధ్యం పరిసరాల శుభ్రత వివిధ అంశాలపై అవగాహన కల్పించారు.

‘ఆరోగ్య మహిళ’పై అవగాహన సదస్సు



తాడూరులో అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి

ఉప్పునుంతల: స్థానిక పీహెచ్‌సీలో శుక్రవారం కొత్తగా ప్రవేశపెట్టిన ఆరోగ్య మహిళ కార్యక్రమంపై మండలంలోని ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎమ్‌లు, ఆశా కార్యకర్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళల్లో నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్‌పై వైద్యాధికారి స్వప్న వివరించారు. లైంగిక, మూత్రనాళ వ్యవస్థలకు సంబంధించిన వ్యాధులు, నివారణ చర్యలపై తెలిపారు. ప్రతి మంగళవారం పీహెచ్‌సీలో 18 ఏళ్ల వయస్సు పైబడిన మహిళలకు క్యాన్సర్‌కు సంబంధించిన పరీక్షలు ఉచితంగా చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ జోన్స్, ఫార్మాసిస్టు శ్రీనివాసులు, స్టాఫ్ నర్సు ఉఫత్ ఉన్నిసా బేగం, హెల్త్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

వైద్య సేవలపై అవగాహన కల్పించాలి

తాడూరు: మండల కేంద్రంతో పాటు గ్రామాలలో వైద్య సేవలపై ఆశావర్కర్లు అవగాహన కల్పించాలని వైద్యాధికారి సంతోష్ అభిరాం అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఆశా వర్కర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లోని గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవం చేసుకునేలా చూడాలన్నారు. విధంగా ఇంటింటా కుష్టు వ్యాధిపై సర్వే నిర్వహించి వ్యాధిగ్రస్తులను గుర్తించాలన్నారు. వారిపై వివక్షత చూపకుండా వ్యాధిని నివారించడంలో అందరూ కృషి చేయాలన్నారు.

పాఠశాలలకు పుస్తకాల పంపిణీ



కోడేరు: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలలోని పాఠశాలలకు పాఠ్య పుస్తకాలను కాంప్లెక్స్ హెచ్‌ఎం కృష్ణయ్య ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పంపిణీ చేసిన పాఠ్య పుస్తకాలు ప్రతి విద్యార్థికి అందేలా చూడాలని ఉపాధ్యాయులను సూచించారు. ఎవరైనా పాఠ్యపుస్తకాలలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కొల్లాపూర్: పట్టణంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలకు ఎంఈఓ చంద్రుడు పాఠ్యపుస్తకాలను అందజేశారు. కొల్లాపూర్ మండలానికి 4,396 పుస్తకాలు, పెంట్లవెల్లి మండలానికి 1,305 పుస్తకాలు వచ్చాయని ఎంఈఓ తెలిపారు.

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే..

పెంట్లవెల్లి: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తప్పకుండా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సింహ యాదవ్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలు గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో తప్పకుండా కేసీఆర్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారన్నారు. తెలంగాణాలోనూ కర్ణాటక ఫలితమే పునరావృతం అవుతుందన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



కందనూలు: మధ్యాహ్న భోజన వంట కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం జిల్లా కేంద్రంలో డీఈఓ గోవిందరాజులు వంట కార్మికుల సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్ హమీద్ ఖాన్ మాట్లాడుతూ.. మిక్స్‌డ్ కూరగాయల కరీ కోసం అదనపు నగదు ఇవ్వాలని కోరారు. గౌరవ వేతనంపెంపు చేపట్టి, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు రాణి, భద్రమ్మ తదితరులు ఉన్నారు.

రైతులను దోపిడీ చేస్తున్న రైస్‌మిల్లర్లు

కల్వకుర్తి: తరుగు పేరుతో రైస్ మిల్లర్లు రైతులను దోపిడీకి గురి చేస్తున్నారని యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అనిల్ గౌడ్ ఆరోపించారు. శుక్రవారం మండలంలోని వెంకటాపూర్‌కు చెందిన రైతు కృష్ణారెడ్డి 270 బస్తాల వరిధాన్యాన్ని ఓ మిల్లుకు తీసకువచ్చారని చెప్పారు. ప్రభుత్వం 2 కిలోలు మాత్రమే తరుగు తీయాలని చెబితే మిల్లు యజమానులు మాత్రం బస్తాకు 4 కిలోల తరుగు తీయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. రైతుకు అండగా మిల్లు వద్దకు వెళ్లి ప్రశ్నిస్తే తమకేమీ తెలియదని అక్కడి సిబ్బంది చెప్పారని, జిల్లా పౌరసరఫరాల అధికారితో మాట్లాడితే వారికేమీ పట్టనట్లు మాట్లాడారని ఆరోపించారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

నాగర్‌కర్నూల్ క్రైం: విద్యుదాఘాతంతో గేదే మృతి చెందిన ఘటన మున్సిపాలిటీ పరిధిలోని చందాపూర్‌శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. జిల్లా కేంద్రానికి చెందిన గోవిందు గేదేను మేతమేసేందుకు చందాపూర్ శివారులోని వ్యవసాయ పొలాలకు తీసుకెళ్లాడు. విద్యుత్‌వైర్లు ప్రమాదవశాత్తు తగిలి గేదే మృతి చెందింది. గేదే విలువ రూ65వేలు ఉంటుందని గోవింద్ తెలిపారు.

ఫ్యాన్లు, ట్యూబ్ లైట్ల వితరణ

లింగాల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థి, విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారి శ్రీనివాసులు శుక్రవారం 20 ఎల్‌ఈడీ ట్యూబ్ లైట్లు, 3 ఫ్యాన్లు వితరణ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెంచులకు ప్రత్యేక వైద్య శిబిరం

అచ్చంపేట రూరల్: మండలంలోని ఏజెన్సీ ప్రాంతమైన అక్కారం, దండ్యాలంతండాలో శుక్రవారం ఐటీడీఏ సహకారంతో చెంచులకు ప్రత్యేకంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పరీక్షించి మందులు, పండ్లు, భోజనం అందజేశారు. వివిధ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యుడు రాజీవ్, డివిజన్ ఉప మలేరియాధికారి అశోక్‌ప్రసాద్, ఐటీడీఏ అధికారి సేవ్యానాయక్, ఉమాభారతి, లక్ష్మి, కల్పన, రవీందర్ పాల్గొన్నారు.



సర్వాంగ సుందరంగా మున్సిపాలిటీలు



పట్టణ ప్రగతి బ్రోచర్ విడుదల చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

కల్వకుర్తి టౌన్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చాక మున్సిపాలిటీలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిందని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. శుక్రవారం దశాబ్ది ఉత్సవాలలో భాగంగా పట్టణ ప్రగతి దినోత్సవంలో అడిషనల్ కలెక్టర్ మనుచౌదరితో కలిసి పాల్గొని మాట్లాడారు. మున్సిపాలిటీలకు గతంలో కొన్ని నిధులు మాత్రమే వచ్చేవని, ప్రస్తుతం ప్రతినెలా నిధులు వచ్చేలా ప్రభుత్వం సహకారం అందిస్తుందన్నారు. పట్టణ ప్రగతి పేరుతో మున్సిపాలిటీలోని అన్ని వార్డులలో అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయన్నారు. పట్టణ సుందరీకరణకు ఇప్పటివరకు రూ.20కోట్ల అభివృద్ధి పనులు చేపట్టామని చెప్పారు. ప్రతినెలలో రూ.72 లక్షల వరకు మున్సిపాలిటీలో పింఛన్ల రూపంలో అందజేస్తున్నామని అన్నారు. ప్రారంభానికి రూ.2 కోట్ల పనులు ఉన్నాయని వాటిని త్వరలోనే ప్రారంభిస్తున్నామని వివరించారు. పట్టణ ప్రగతితో పాటుగా, మున్సిపాలిటీలో చేపట్టిన అభివృద్ధిపై ప్రగతిపత్రాన్ని ఎమ్మెల్యే, అడిషనల్ కలెక్టర్ విడుదల చేశారు.

వాహనాన్ని నడిపిన ఎమ్మెల్యే

మున్సిపాలిటీలో పట్టణప్రగతి దినోత్సవంలో భాగంగా బస్టాండ్ వద్ద ఉన్న ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన ముగ్గుల పోటీలలో పాల్గొన్నారు. అనంతరం అక్కడి నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు నిర్వహించిన ప్రగతి ర్యాలీలో పాల్గొని, మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులను అభినందించారు. మున్సిపల్ పారిశుద్ధ్య వాహనాన్ని నడిపారు. కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన మున్సిపల్ సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్మికులకు కొత్త దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సత్యం, వైస్ చైర్మన్ షాహెద్, కౌన్సిలర్లు, కమిషనర్ అశ్రిత్ కుమార్, మేనేజర్ రాజకుమారి, ఏఈ శివకృష్ణ పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలపై అధికారులతో సమీక్ష

చారకొండ: దశాబ్ది ఉత్సవాలపై మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ కార్యాలయంలో ఎంపీడీఓ జయసుధ పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. శనివారం, ఆదివారం కార్యక్రమాలను గ్రామాల్లో అధికారులు విజయవంతం చేయాలని అన్నారు. సమావేశంలో ఎంపీడీఓ వెంకటేష్, కార్యదర్శులు ఉన్నారు.



చారకొండలో మాట్లాడుతున్న ఎంపీడీఓ జయసుధ

ఉత్సవాలను విజయవంతం చేయండి

వెల్దండ: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం కార్యదర్శులకు, ఉపాధి హామీ సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ శ్రీనివాసులు మాట్లాడుతూ దశాబ్ది ఉత్సవాలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. 17న గిరిజనోత్సవాలు, 18న మిషన్ భగీరథ, 19న హరితహార కార్యక్రమాల నిర్వహణకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో కార్యదర్శులు అందుబాటులో ఉండి కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు. హరితహారం కార్యక్రమంలో మొక్కలు నాటేందుకు ఉపాధి హామీ సిబ్బందితో గుంతలను ఏర్పాటు చేసి మొక్కలను సిద్ధంగా ఉంచుకోవాలని కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఏపీఓ ఈశ్వర్, ఏఈ లలిత, ఈసీ దేవేందర్, టీఏ రాజ్‌కుమార్, లింగస్వామి, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

యూత్ డిక్లరేషన్ పోస్టర్ల ఆవిష్కరణ



విద్యార్థులకు వివరిస్తున్న కేతూరి వెంకటేష్

కొల్లాపూర్: పట్టణంలోని ప్రభుత్వ పీజీ క్యాంపస్‌లో కాంగ్రెస్ పార్టీ యూత్ డిక్లరేషన్ పోస్టర్లను ఆవిష్కరించారు. యూత్ డిక్లరేషన్‌కు సంబంధించిన అంశాలను పీజీ విద్యార్థులకు జాతీయ ఓబీసీ కోఆర్డినేటర్ కేతూరి వెంకటేష్ వివరించారు. రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి వస్తే తెలంగాణ అమరవీరుల త్యాగాలకు, ఉద్యమకారులకు గుర్తింపు కల్పిస్తామన్నారు. పారదర్శకంగా ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులు సకాలంలో చేస్తామన్నారు. మెరుగైన ఉన్నత విద్యను అందిస్తామన్నారు. కార్యక్రమంలో జగదీశ్వరుడు, కృష్ణయ్యగౌడ్, రాముయాదవ్, బీరన్నయాదవ్, కాంతారావు పాల్గొన్నారు.

ముదిరాజ్ కమిటీ ఏకగ్రీవం

లింగాల: మండల కేంద్రంలో శుక్రవారం బీసీ ఐక్య వేదిక అధ్యక్షుడు రాజలయ్య, ముదిరాజ్ మండల మహాసభ అధ్యక్షుడు సత్యం ఆధ్వర్యంలో లింగాల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా తిర్పతయ్య, పాపయ్య, అధ్యక్షుడిగా ఎల్లయ్య, ఉపాధ్యక్షుడిగా ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా శివ, కార్యదర్శిగా మల్లేష్, కోశాధికారిగా కృష్ణతో పాటు సభ్యులుగా నియమించారు.

మీసేవా కేంద్రాల తనిఖీ

బల్మూర్: మండల కేంద్రంలోని మీసేవా కేంద్రాలను శుక్రవారం తహసీల్దార్ కిష్యానాయక్ తనిఖీ చేశారు. కేంద్రాలలో అధిక రేట్లు వసూలు చేస్తున్నారని వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తూ ఫిర్యాదులు రావడంతో తనిఖీ చేసినట్లు తెలిపారు. కేంద్రాలలో అధిక రేట్లు వసూలు చేసినట్లు నిరూపన అయితే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు. కేంద్రాల నిర్వాహకులు అధిక రేట్లు వసూలు చేస్తే వినియోగదారులు తమకు ఫిర్యాదు చేయాలన్నారు.

గడువు పొడిగించాలి

కల్వకుర్తిరూరల్: బలహీన వర్గాలలోని చేతి, కులవృత్తులు చేసుకునే కులాలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రూ.లక్ష లోపు రుణాన్ని ప్రకటించింది. దరఖాస్తుకు ఈ నెల 20 వరకు గడువు విధించారని యువజన సంఘాల జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్ చెప్పారు. సాంకేతిక సమస్యల వల్ల చాలా మందికి ధ్రువీకరణ చేతికందలేదన్నారు. ఈ సమస్యలను పరిగణలోకి తీసుకుని ప్రభుత్వం ఈ నెల చివరి వరకు గడువును పొడిగించాలని డిమాండ్ చేశారు.

సమయపాలన పాటించాలి

వెల్దండ: మండల కేంద్రంలోని మోడల్ హైస్కూల్ ఉపాధ్యాయులతో శుక్రవారం ప్రిన్సిపాల్ పుష్పలత ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆదర్శ పాఠశాలల జాయింట్ డైరెక్టర్ సరోజినిదేవి పాఠశాలలను తనిఖీ చేయడంతో ఉపాధ్యాయులకు ప్రిన్సిపాల్ సలహాలు, సూచనలు చేశారు. ప్రతి తరగతికి ఉపాధ్యాయులను ఇన్‌చార్జ్‌లుగా నియమించారు. విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టి ఉత్తమ ఫలితాలను వచ్చే విధంగా బోధించాలన్నారు. ప్రతి వారం సమావేశాలను నిర్వహించి పలు అంశాలను చర్చించేలా చూడాలన్నారు. గతేడాది పదో తరగతిలో, ఇంటర్మీడియట్‌లో ఫలితాలు తక్కువ రావడంతో సబ్జెక్టుల వారీగా ప్రిన్సిపాల్ వివరించారు.

